క్లుప్తంగా

బాటిళ్లలో పెట్రోలు ఇవ్వొద్దని నోటీసులు



పెట్రోలు బంకుల్లో నోటీసులు ఇస్తున్న సహాయ కమిషనర్ రామకృష్ణుడు

చిత్తూరు అర్బన్: పెట్రోలు బంకుల్లో బాటిళ్లల్లో ఎవ్వరికీ పెట్రోలు, డీజిల్ ఇవ్వొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బందితో ఆమె గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నగరంలో ఎక్కడా పెట్రోలు విడిగా విక్రయించకుండా అందరికీ నోటీసులు జారీ చేయాలన్నారు. కమిషనర్ ఆదేశాలతో కార్పొరేషన్ సహాయ కమిషనర్ రామకృష్ణుడు, సిబ్బంది నగరంలోని అన్ని పెట్రోలు బంకుల నిర్వాహకులను నోటీసులు అందజేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమం



పత్రపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని పత్రపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులకు, బీపీ, సుగర్‌వాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

28 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతాప్ స్వామి

వెదురుకుప్పం: మండలంలోని మాకమాంబాపురం సమీపంలో ఉన్న ప్రసన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి వార్షికోత్సవం, హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి తెలిపారు. గురువారం ఆలయం వద్ద ఉత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ప్రతి రోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు, ధార్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీతారామ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు చెప్పారు.

చిత్రలేఖనంపై అవగాహన అవసరం



విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పిస్తున్న సుబ్రమణ్యం

కార్వేటినగరం: విద్యార్థులు చిత్ర లేఖనంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ సుబ్రమణ్యం తెలిపారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణలో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం కూడా విద్యాబోధనలో ఒక భాగమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శంకర్‌బాబు, రాఘవేంద్రరాజు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం దాతలు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి కుమారుడు భువన్‌తేజ్ జన్మదిన వేడుకలను సందర్భంగా వృద్ధాశ్రమంలో భువన్‌తేజ్ కేక్ కట్ చేసి, వృద్ధులకు పంచి పెట్టాడు. అలాగే స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు మాట్లాడుతూ ప్రజాసేవ కోసం పరితపించే కుటుంబంలో పుట్టిన భువన్‌తేజ్ ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పాల్గొన్నారు.



వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న భువన్‌తేజ్

అంతర్గత 'ఆడిట్' దందా

- చిత్తూరు కార్పొరేషన్‌లో ఆడిటర్ల వసూళ్లు
- మామూళ్లు ఇవ్వలేక ఉద్యోగుల గగ్గోలు
- ఒక్కో విభాగానికి ఒక్కో రేటు.. ఆపై ఖరీదైన బహుమతులు
- ప్రతి ఏటా ఇదే తంతు.. స్పందించని అధికారులు



చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అంతర్గత ఆడిట్ పేరిట దందా నడుస్తోంది. ప్రతీ ఏటా ఇక్కడి బిల్లులను పరిశీలించి, ఆడిట్ చేయడానికి వచ్చే అధికారులకు మామూళ్లు ఇవ్వలేక అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. పెద్ద మొత్తంలో నగదుతో పాటు వెళ్లేప్పుడు బంగారు ఉంగరాలు, ఖరీదైన బహుమతులు సైతం ఇచ్చుకోవాలి. ఇందుకోసం కార్పొరేషన్‌లో ఓ వ్యక్తి ప్రత్యేకంగా పనిచేస్తున్నారు. అధికారులు అడిగినంత ఇవ్వలేక, సాదాసీదా ఉద్యోగులు నెత్తినోరు కొట్టుకుంటున్నారు.

ఆడిట్‌లో ఏం చేయాలి?

కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి ఏటా నిధుల జమ, ఖర్చులు రికార్డులు రాస్తుంటారు. ఏయే పనులు చేయడానికి ఎంత మొత్తం నిధులు ఖర్చు చేస్తున్నారు? ఇవి నిబంధనలకు లోబడి ఉన్నాయా? టెండర్లు పిలిచారా? నామినేషన్ పేరిట పనులు అప్పగించారా? అసలు పాలకవర్గం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండానే నిధులు ఖర్చు చేసేశారా? ఉద్యోగులు ఎవరైనా అడ్వాన్సులు తీసుకుని వాటిని చెల్లించేసేరా? అనే విషయాలపై థర్డ్‌పార్టీతో గణాంకాలు సరిచూడాలి. ఇక్కడ థర్డ్‌పార్టీ అనడానికి వీల్లేకుండా తమ కార్యాలయంలో అంతర్గత ఆడిట్ చేయాలని కమిషనర్, జిల్లా ఆడిట్ అధికారికి లేఖ రాయగా, అక్కడ పనిచేసే ఓ బృందం 50 నుంచి 70 రోజుల వరకు కార్పొరేషన్ కార్యాలయంలో నిధుల వ్యయానికి సంబంధించి ప్రతి ఒక్క ఫైలును క్షుణ్ణంగా పరిశీలిస్తారు. వీటిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని గుర్తించి రాష్ట్ర అధికారులకు నివేదించడం, ఆపై ఇవి కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) పరిధిలోకి వెళతాయి. నిధులను ఇష్టానుసారం ఖర్చుచేసిన అధికారుల తప్పులను ఎత్తి చూపించి, వాటికి పరిష్కార మార్గాలను సైతం జిల్లా ఆడిట్ అధికారులు సూచించాలి. ఇలా ప్రతి ఏటా, ఆ కిందటి ఏడాదికి సంబంధించిన గణాంకాలను ఆడిట్ చేయాల్సి ఉంటుంది.

ఏం చేస్తున్నారంటే..!

చిత్తూరు కార్పొరేషన్‌లో ప్రతి ఏటా జిల్లా ఆడిట్ కార్యాలయం నుంచి ఐదుగురితో కూడిన అధికారుల బృందం నిధుల వినియోగానికి సంబంధించి ఆడిట్ చేస్తుంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండు రోజుల క్రితం ఈ బృందం ఆడిట్ పూర్తి చేసి వెళ్లిపోయింది. వీళ్లు ఇలా వెళ్లారో లేదో, కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది సొంతూరు వచ్చినట్లయ్యింది. ఎందుకంటే కార్పొరేషన్ కార్యాలయంలో పలు బిల్లుల చెల్లింపుపై ఆడిట్ బృందం కొన్ని అభ్యంతరాలను ఎత్తి చూపించింది. తుది నివేదికలో వీటిని రాతపూర్వకంగా చూపించకుండా ఉండటానికి ఆడిట్ అధికారుల బృందానికి రూ.3 లక్షల రేటును ఫిక్స్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ మొత్తాన్ని చెల్లించడానికి కార్పొరేషన్‌లోని ఒక్కో విభాగాధిపతికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వాటాలు ఇవ్వాలని మౌఖిక ఆదేశాలు వెళ్లాయి. అడిగినంత ఇవ్వడానికి విభాగాధిపతులు వారి కింది స్థాయి సిబ్బంది నుంచి ముక్కుపిండి మామూళ్లు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పైగా ఆడిట్ అధికారుల బృందానికి ప్రతి రోజూ బిర్యానీలు, వాళ్లను ఇళ్ల వద్దకు దింపడానికి, కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు వెళ్లడానికి కార్లు అన్నీ కూడా కార్పొరేషన్ అధికారులే సమకూర్చాల్సిన పరిస్థితి. బృందంలో మహిళా అధికారి ఉంటే రూ.30 వేలు తగ్గకుండా పట్టుచీర కూడా ఇవ్వాల్సిందేనని కార్పొరేషన్ ఉద్యోగి ఒకరు తన ఆవేదన వ్యక్తం చేశారు.

చివర్లో భారీ షాక్

జిల్లా ఆడిట్ అధికారులు ఇచ్చిన నివేదికలను తనిఖీ చేయడానికి ప్రతి ఐదేళ్లకు ఓసారి ఉన్నతాధికారులు వస్తుంటారు. గతేడాది వచ్చిన ముగ్గురు సభ్యుల బృందానికి ఏకంగా రూ.6లక్షలు సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. వెళ్లేప్పుడు వీళ్లకు దీపావళి కానుకగా టపాసుల బాక్సులు, ఒక్కొక్కరికి ఒక్కో బంగారు ఉంగరం సమర్పించుకున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపించడానికి కార్పొరేషన్ కార్యాలయంలో ఓ ప్రత్యేక ఉద్యోగి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. విభాగాధిపతుల నుంచి మామూళ్లు వసూలుచేయడంతో పాటు పలు తప్పుడు బిల్లులు సృష్టించి ఆ మొత్తాన్ని ఆడిట్ అధికారులకు సర్దిఇస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ రామకృష్ణుడు స్పందిస్తూ 'ఈ విషయంపై ఏం జరిగిందో విచారణ చేస్తాం. కమిషనర్ దృష్టికి సైతం తీసుకెళ్తాం.' అన్నారు.

ఇంటివద్దే మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రక్షిత అన్నారు. మండలంలోని వెంగమాంబపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కవిత, కార్లిమా, రీటా పాల్గొన్నారు.

26 నుంచి ఉచిత యోగా శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని గిరింపేట మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో 10 రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు యోగాచార్యులు నరేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధ సమాధి యోగా ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణ తరగతులు ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఈ శిక్షణలో యోగాసనాలు, శారీరక వ్యాయామాలు, ప్రాణాయామం, ధ్యానం, స్వీయ చిత్రలేఖనం, నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపుదల, కథలతో బాధ్యతలు పెంపొందించనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణను నగరంలోని విద్యార్థులు, యువత, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 82476 09140 ను సంప్రదించాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవ పూజలు





విశేషాలంకారంలో గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి, పూజలు చేస్తున్న అర్చకులు

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లెలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురువారం వార్షిక పూజలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు స్వామివారి వార్షిక మహోత్సవ పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం కలశస్థాపన, గణపతి పూజ, గణపతిహోమం, రక్షాబంధనం, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి మాల వర్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పండ్ల తోటల పెంపకం

వెదురుకుప్పం: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లు, పూల తోటల పెంపకం చేపడుతున్నట్లు ఏపీఓ ఇందు గురువారం తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ కింద ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పండ్లతోటలు, పూల తోటల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా మామిడి, కొబ్బరి, జామ, అల్లనేరేడు, డ్రాగన్‌ఫ్రూట్, దాన్నిమ్మ, నిమ్మ చెట్లు, రోజా, మల్లె పూల తోటలు, మునగ తోటలు పెంపకం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని చిన్న సన్నకారు రైతులు, 5 ఎకరాల భూమి ఉన్నా లేదా 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు అర్హులన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తులను తమ వద్ద గానీ, గ్రామీణ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల వద్ద సమర్పించాలన్నారు. రైతులు మొక్కలు తెచ్చుకున్నాక ఉపాధి హామీ పథకం నుంచి బిల్లులు చెల్లిస్తామన్నారు.

పెట్రోల్ విడిగా విక్రయించడం నిషిద్ధం

- అధికారులు చర్యలు చేపట్టండి
- సమావేశంలో చిత్తూరు అసెంబ్లీ ఆర్ఓ శ్రీనివాసులు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా బాటిల్స్, డ్రమ్ముల్లో పెట్రోల్, డీజిల్ విక్రయించడం నిషిద్ధమని చిత్తూరు అసెంబ్లీ ఆర్ఓ శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం పలు శాఖల అధికారులు, పెట్రోల్ బంకుల యజమానుల అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించారు. ఆర్ఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లల్లో, డ్రమ్ముల్లో పట్టే ప్రక్రియను నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఈ నిబంధనలను జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల యజమానులు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఫిర్యాదులు వస్తే పెట్రోల్ బంకుల అనుమతులను రద్దు చేస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాకు పెట్రోల్, డీజిల్ తీసుకొచ్చి అమ్మితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమ అమ్మకాలు జరిగితే వెంటనే అధికారులకు ఫిర్యాదులు చేయాలన్నారు. బ్యాంకులు, సెల్‌టవర్స్, హ్యాండ్లూమ్స్‌కు డీజిల్, పెట్రోల్ అవసరం ఉంటుంది కాబట్టి అలాంటి వారు సంబంధిత తహసీల్దార్ వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు పొందే వారి ధ్రువపత్రాలను పరిశీలించి యజమానులు పెట్రోల్, డీజిల్‌ను విక్రయించాలని తెలిపారు.

పెట్రోల్ బంకులపై ప్రత్యేక నిఘా

జిల్లాలోని పెట్రోల్ బంకులపై ప్రత్యేక నిఘా పెట్టాలని చిత్తూరు ఆర్ఓ శ్రీనివాసులు అన్నారు. ఆయన గురువారం ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా అక్రమంగా పెట్రోల్, డీజిల్‌ను విక్రయించకుండా గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల స్టాక్ పాయింట్లను ఆర్డీఓలు పరిశీలించాలని చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు సమన్వయంగా, అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కలెక్టర్లు పెట్రోల్ బంకులను తనిఖీ చేయాలని తెలిపారు. ఎక్కడైనా అక్రమ అమ్మకాలు, సరఫరా జరిగితే సీజ్ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. మండల స్థాయిలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించే సర్వసభ్య సమావేశాలకు సంబంధించి ముందస్తుగా స్థానిక ఎస్‌హెచ్ఓలకు సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎస్ఓ శంకరన్, ఏఎస్ఓ శివరామరాజు, పెట్రోల్ బంకుల యజమానుల అసోషియేషన్ నాయకులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో బుద్ధ పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. పౌర్ణమి వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

ఆలయంలోని మండపంలో అర్చకులు సుదర్శన హోమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అర్చకులు కలశ పూజ చేసి కలశారాధన చేశారు. అర్చకులు హోమం నిర్వహించి వేదమంత్రోచ్చరణ చేశారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ హనుమంతురావు పర్యవేక్షించారు.



అర్ధగిరి క్షేత్రంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రూ.5.55 లక్షల ఆదాయం

అర్ధగిరి క్షేత్రంలో గురువారం ఆలయంలో నిర్వహించిన వేలం పాట ద్వారా రూ.5.55 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఎండోమెంట్ అధికారి సుమనప్రియ ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆలయంలో తలనీలాలు సేకరించే హక్కు పొందడానికి గుడియాత్తానికి చెందిన యోగానందం రూ.4.55 లక్షలు పాడి కైవసం చేసుకున్నట్లు వివరించారు. కొబ్బరి చిప్పలు సేకరించే హక్కును పత్రపల్లెకు చెందిన నాగమ్మ రూ. 1 లక్ష అధికంగా పాడి కైవసం చేసుకొన్నట్లు వెల్లడించారు.

వృద్ధులు బీసీజీ టీకాలు వేయించుకోవాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: మండలంలో 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకాలను వేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఆమె బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిని 2025 నాటికి పూర్తిగా నివారించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. మధుమేహం ఉన్నవారు కూడా వ్యాక్సిన్ వేయించుకోవచ్చని తెలిపారు. దీని మూలంగా ఎలాంటి ఇబ్బందులు రావని పేర్కొన్నారు. క్షయ వ్యాధి రాకుండా నియంత్రించేందుకు వ్యాక్సిన్ పనిచేస్తుందన్నారు. 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ, 18 ఏళ్లు నిండి పొగ తాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రస్తుతం వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. గతంలో క్షయ మందులు వాడిమానేసిన వారికి కూడా వ్యాక్సిన్ వేయనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సిన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. 218 మందికి వ్యాక్సిన్ వేసినట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్ఎన్ జీవకళ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సదుం: స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి గురువారం తెలిపారు. 2024 సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలురు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పదవ తరగతి తాత్కాలిక మార్కుల లిస్ట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఎంచుకున్న గ్రూపులకు ఈనెల 27 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామన్నారు.

వేరుశనగ విత్తన రిజిస్ట్రేషన్‌కు విశేష స్పందన







ఐరాల: ఇరువారంపల్లెలో వేరుశనగ రిజిస్ట్రేషన్‌లో ఏఓ వరలక్ష్మి, తవణంపల్లె: టి.పుత్తూరు ఆర్బీకేలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు, బంగారుపాళెం: టేకుమంద ఆర్‌బీకేలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

ఐరాల: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో వేరుశనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో 1,683 మంది రైతులు 860 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఏఓ వరలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఐరాల, నాగంవాండ్లపల్లె, మొరంపల్లె, ఇరువారంపల్లె ఆర్బీకేల్లో విత్తన వేరశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించినట్లు తెలిపారు. 1,710 క్వింటాళ్ల కే–6 రకం వేరుశనగను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. త్వరలోనే విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తామన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అందరికీ విత్తన వేరుశనగ అందజేస్తామని ఏఓ తెలిపారు.

వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలంలో గురువారం వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచే వ్యవసాయ శాఖ సిబ్బంది విత్తన పంపిణీని ప్రారంభించారు. దీంతో రైతులు క్యూకట్టారు. వేలిముద్ర సేకరణ ద్వారా రైతులకు కాయలను అందించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పంపిణీ చేశారు. తొలి రోజు ఐదు ఆర్బీకేల ద్వారా 865 మంది రైతులకు గాను 1,150 బ్యాగులు అందజేశామని మండల వ్యవసాయశాఖ అధికారి వేణు తెలిపారు.

విత్తనాల పంపిణీకి చర్యలు

తవణంపల్లె: మండలంలో రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీకి వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని 17 ఆర్‌బీకేల్లో 1710 కింటాళ్ల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రిజిస్ట్రేషన్ కోసం బారులు తీరారు. రెండు రోజులపాటు పర్మిట్లు అందజేసిన తర్వాత విత్తనాలు పంపిణీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు.

విత్తన రిజిస్ట్రేషన్లు ప్రారంభం

బంగారుపాళెం: వేరుశనగ విత్తన కాయల కోసం మండలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం వ్యవసాయాధికారులు ప్రారంభించారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రభుత్వ రాయితీ వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. రెండు రోజుల పాటు రిజిస్ట్రేషన్లు చేసిన తరువాత శనివారం నుంచి వేరుశెనగ విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వేరుశెనగ విత్తన కాయలు అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, ఫోన్ నంబరు తీసుకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.



పూతలపట్టు: రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

అందుబాటులో వేరుశనగ విత్తనాలు

పూతలపట్టు: వేరుశనగ విత్తనాలు మండలంలోని రైతులకు అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయాశాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. ఆయన గురువారం మండలంలోని తలపులపల్లి రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంపిణీ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విత్తనాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా వారి పొలంలో విత్తనాలను వేయాలని సూచించారు. మండలంలో 16 రైతుభరోసా కేంద్రాలకు గాను 1350 క్వింటాళ్ల కె–6 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు రెండు రోజుల్లో విత్తనాలను అధికారులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుల ఉమ, మండల వ్యవసాయాధికారి మధురవాణి పాల్గొన్నారు.